క్లుప్తంగా

కలెక్టర్‌కు ఫిర్యాదు

జగిత్యాల: సెలవులో ఉంటే విధులకు గైర్హాజర య్యారని తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఓ వ్యక్తి ఇబ్బందులు పెడుతున్నాడని రెండో ఏఎన్ఎం రాష్ట్ర సంఘం అధ్యక్షురాలు పడాల మమత జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

సైనికులకు నివాళి

జగిత్యాల: దోడాలో మిలిటెంట్ దాడిలో మరణించిన వీర సైనికులకు భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో శుక్రవారం ఘనంగా నివాళి అర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, అక్కినపల్లి కాశీనాథం, వేముల పోచమల్లు, సింగం గంగాధర్, శ్రీనివాస్, దేవరాజం, ప్రవీణ్, మల్లికార్జున్, భూమన్న, బాలన్న పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌కు సన్మానం

జగిత్యాల: జిల్లా అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎన్నికైన ఎండీ షమియుద్దీన్‌ను శుక్రవారం భారత్ సురక్ష సమితి నాయకులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు, కాశీనాథం, వేముల పోచమల్లు, సింగం గంగాధర్, నారెందుల శ్రీనివాస్, గంధ్ర ప్రవీణ్‌రావు, వేముల దేవరాజం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు..

రాయికల్: రామాజీపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులు వేల్పుల స్వామి, శ్రీనివాసచారి, సతీశ్, అంజుమ్‌బేగం, శివాజీనగర్‌లోని ఒడ్డెరకాలనీ ప్రాథమిక పాఠశాలలో బొల్లె గంగాధర్, దొంతి సతీశ్, పదోన్నతి పొందిన బేతి మోహన్‌రెడ్డిని శుక్రవారం ఆయా పాఠశాలల్లో ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ వెంకమ్మ, బెజ్జంకి మోహన్, వాసరి రవి, కట్కం రమేశ్, సుజాత పాల్గొన్నారు.

ఆవాస విద్యార్థులకు చేయూత

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని వాల్మీకి ఆవాస విద్యార్థులకు యశస్వి ఎలక్ట్రానిక్స్ అధినేత కోటగిరి శ్రీనివాస్–మంగ దంపతులు, వారి కుమారుడు శుక్రవారం యూనిఫాంలు అందజేశారు. 60 మంది విద్యార్థులకు రూ.40,000 విలువ చేసే దుస్తులను కోటగిరి యశస్వి–శ్రావ్య అందజేశారు. ఆవాస కమిటీ సభ్యులు చిత్తారి మధుకర్, ఎన్నమనేని అశోక్‌రావు, అయిల్నేని వెంకటేశ్వర్‌రావు, సంపూర్ణచారి, సుద్దాల మల్లేశం పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



భీంరాజ్‌పల్లిలో పెద్ద పులి వేషధారణలో యువకులు

గొల్లపల్లి: భీంరాజ్‌పల్లి గ్రామంలో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. బీబీకే(భీంరాజ్ పల్లి బొమ్మన కుమార్) ఆధ్వర్యంలో ఎరుసాని రాజయ్య జ్ఞాపకార్థం గ్రామంలో యూత్ సభ్యులకు పెద్దపులి ప్యరెలు వితరణ చేయగా.. శుక్రవారం ప్రారంభించారు. చిల్వాకోడూర్‌తో పాటు పలు గ్రామాల్లో నిర్వహించారు.


జగిత్యాల విద్యార్థి ప్రతిభ



లండన్‌లో పట్టా అందుకుంటున్న శ్రీజ

జగిత్యాల: జిల్లాకేంద్రానికి చెందిన శ్రీజ అనే విద్యార్థి లండన్ యూనివర్సిటీ ఆఫ్ లెస్ సిస్టర్ నుంచి ఎమ్మెస్సీ ఇంటర్నేషనల్ మేనేజ్ పట్టా అందుకున్నారు. లండన్‌లో జరిగిన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ప్రతినిధుల నుంచి పట్టా అందుకున్నారు.


పోగొట్టుకున్న సెల్ అప్పగింత



సెల్ అందిస్తున్న ఎస్సై

ధర్మపురి(బుగ్గారం): బుగ్గారం మండలం సిరికొండ గ్రామానికి చెందిన కొండపల్కల అంజిత్‌రావ్ సెల్ 2023 సెప్టెంబర్ 1న పోయింది. ఎస్సై శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తెలుసుకొని శుక్రవారం బాధితుడికి అందజేశారు.

అమ్మ మాట–అంగన్వాడీ బాట



మోహన్‌రావుపేటలో ప్రచారం చేస్తున్న అంగన్వాడీ సూపర్‌వైజర్, టీచర్లు

కోరుట్ల రూరల్: మోహన్‌రావుపేట, వెంకటాపూర్, గుమ్లాపూర్, చిన్నమెట్‌పల్లి గ్రామాల్లో ఇంటింటికీ అమ్మ మాట–అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీమ్ సుల్తానా పిల్లల తల్లులకు ప్రీ స్కూల్‌పై వివరించారు. టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల అలంకరణలో వాసవీమాత

కోరుట్ల: పట్టణంలోని వాసవీమాత ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. వాసవాంబ శాకాంబరి అవతారంలో భక్తులకు దర్శమిచ్చారు. మహిళలు కుంకుమార్చన , గోరింటాకు ఉత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుడు రాముశర్మ, వైశ్య సంఘ అధ్యక్షుడు మోటూరి రాజేంద్రప్రసాద్, కంటాల భాస్కర్, కోటగిరి శైలజ తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరునికి క్షీరాభిషేకం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం రంగురంగుల పూలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసచార్యులు ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీహవన కార్యక్రమాన్ని నిర్వహించారు.





మహాలక్ష్మి అమ్మవారి తీర్థాలు

రాయికల్: అల్లీపూర్ గ్రామంలో గ్రామ దేవత మహాలక్ష్మీ అమ్మవారి తీర్థాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వివిధ కుల సంఘాల మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకునేందుకే రుణమాఫీ



జగిత్యాలరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు



వేంపేటలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



యూసుఫ్‌నగర్‌లో..

జగిత్యాలరూరల్: రైతాంగాన్ని ఆదుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రుణమాఫీ చేసిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. రైతాంగానికి ప్రభుత్వం రుణమాఫీ చేయగా శుక్రవారం జగిత్యాలరూరల్ మండలం నర్సింగాపూర్, తదితర గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేసేందుకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో రైతాంగానికి పెట్టుబడి రాయితీ కూడా అందించడం జరుగుతుందన్నారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ సురేందర్, మాజీ ఎంపీపీ మంగళారపు మహేశ్, నాయకులు రాజిరెడ్డి, భూమారెడ్డి, తిరుపతిరావు, వేణు, నరేశ్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మెట్‌పల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీ రైతుల రుణాలు మాఫీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అన్నారు. వేంపేట శివారులో పంట పొలాల వద్ద రైతులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాజారెడ్డి, ప్రవీణ్, లింగారెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, నాయకులు సురేశ్‌గౌడ్, లింబాద్రి, రాంచందర్‌రావు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: రైతులకు పంట రుణాలు మాఫీపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సాహసోపేతమని కొల్వాయి సహకార సంఘం అధ్యక్షుడు పొల్సాని నవీన్‌రావు అన్నారు. సహకార సంఘ కార్యాలయ భవనం వద్ద రైతులతో కలిసి సంబరాలు జరిపారు. ఎలగందుల శ్రీనివాస్, రాజేందర్, రంగు లక్ష్మణ్, రౌతు సత్తయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కొమిరెడ్డి విజయ్ అజాద్, జెట్టి లింగం, అల్లూరి మహేందర్‌రెడ్డి, చెర్లపల్లి రాజేశ్వర్ తదితరులున్నారు.

రాయికల్: మైతాపూర్, మంక్యానాయక్‌తండాలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. గోపి రాజిరెడ్డి, తలారి రాజేశ్, గరిపెల్లి శ్రీనివాస్, గంగమల్లయ్య, సత్యనారాయణ, స్వామిరెడ్డి, భూక్య జీవన్, సూర్యనాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

మల్యాల: కాంగ్రెస్ పార్టీ మరోమారు రైతు పక్షపాతిగా నిరూపించుకుందని ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు శనిగరపు తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో శుక్రవారం ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు శనిగరపు తిరుపతి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

ధర్మపురి: జైనా సహకార సంఘం ఆవరణలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కట్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు కుంట సుధాకర్, కట్ల భువనేశ్వర్, అల్లె శంకర్, గడ్డి రాజన్న తదితరులున్నారు.

ఈత చెట్లు నరికినవారిపై చర్యలు తీసుకోవాలి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారు తుమ్మల చెరువు శిఖం భూమిలో ఉన్న ఈత చెట్లు నరికివేసి భూమి కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ గౌడ సంఘం సభ్యులు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. తుమ్మల చెరువు శిఖం భూమి సర్వే నంబర్ 321లో ఉన్న 200 ఈత చెట్లకు కల్లు గీసి గత 50 ఏళ్లుగా జీవనోపాధి పొందుతున్నామని, ఈ చెట్లను ముగ్గురు వ్యక్తులు ఇటీవల తొలగించి భూమి కబ్జా చేశారన్నారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సంఘం ప్రతినిధులు, సభ్యులు తహసీల్దార్‌ను కోరారు. తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గౌడ సంఘం సభ్యులు

ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చాలి

కోరుట్ల: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అభయ హస్తంలో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువజన విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కిషన్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఉరుమడ్ల చరణ్, అల్వాల శంకర్, పోగుల భూమయ్య, సురేశ్, సంతోష్, సత్తయ్య, సాగర్, నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

హరీశ్‌రావును రాజీనామా చేయాలని అడిగే హక్కు లేదు

కథలాపూర్: మాజీ మంత్రి హరీశ్‌రావును ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని అడిగే హక్కు కాంగ్రెస్ నేతలకు లేదని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అన్నారు. శుక్రవారం కథలాపూర్‌లో విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, బద్దం మహేందర్ రెడ్డి, కొత్తపెల్లి శ్రీనివాస్, గడ్డం శేఖర్‌రెడ్డి, పూండ్ర జనార్దన్‌రెడ్డి, సూర్నేని వినోద్‌రావు, పుర్కుటపు గంగారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోక బాపురెడ్డి

విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం

జగిత్యాల: సమాజ గమనానికి మహిళ ప్రధానమని మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ అశ్విని అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు కళాశాలల్లో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలను చదివించాలని, విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని చెప్పారు. అనంతరం ఆడపిల్లలపై వివక్ష, లింగ వివక్షత గురించి వివరించారు. కార్యక్రమంలో గౌతమి, గంగాధర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిరుపేద విద్యార్థినికి చేయూత

కథలాపూర్: అంబారిపేట గ్రామానికి చెందిన అంగడి జ్యోత్స్న అనే నిరుపేద ఇంజనీరింగ్ విద్యార్థినికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చేయూతనందించారని బీజేపీ మండల నాయకులు శుక్రవారం తెలిపారు. హైదరాబాద్‌లోని సీబీఐటీ కళాశాలలో బీటెక్ సెకండ్‌ఇయర్ చదువుతోంది. ల్యాప్‌టాప్ అందించాలని బండి సంజయ్‌కుమార్‌ను ఇటీవల కలిసి విన్నవించారు. ఆధునిక టెక్నాలజీతో కూడిన ల్యాప్‌టాప్‌ను బీజేపీ నాయకుల ద్వారా పంపించారు. శుక్రవారం మండల నాయకులు జ్యోత్స్న ఇంటికెళ్లి అందించారు.



జ్యోత్స్నకు ల్యాప్‌టాప్ అందిస్తున్న బీజేపీ నాయకులు

ఏడాదైనా వినియోగంలోకి రాని గోపాలమిత్ర భవనం

పెగడపల్లి: ఎల్లాపూర్ గ్రామంలో గోపాలమిత్ర భవనం నిర్మించి ఏడాదైనా.. వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మండలంలో ఎక్కడ కూడా పశువైద్య ఉప కేంద్రాల్లేవు. దీంతో మారుమూల గ్రామాల పశువులకు సకాలంలో వైద్యం అందని ద్రాక్షగా మారింది. మారుమూల గ్రామాల రైతులు మండల కేంద్రంలో ఉన్న పశువైద్యశాలకు పశువులకు తీసుకొచ్చి చికిత్స చేయించాలంటే .. అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. మారుమూల ప్రాంతాల పశువులకు సకాలంలో వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఎల్లాపూర్‌లో గోపాలమిత్ర భవనం నిర్మించారు. నిర్మాణం కోసం రూ.6లక్షలు కేటాయించారు. నిర్మాణం జరిగి ఏడాది దాటినా వినియోగంలోకి తెచ్చేందుకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గ్రామ శివారులో నిర్మించిన భవనం రాత్రిపూట మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు.



నిరుపయోగంగా గోపాలమిత్ర భవనం

సీజనల్ వ్యాధుల నివారణకు ఫ్రై డే–డ్రై డే

కోరుట్లటౌన్: సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలు ఫ్రై డే–డ్రై డే పాటించాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరణ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 1,9,27 వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ తిరుపతితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని గుర్తించి తొలగించేలా చర్యలు చేపట్టారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కౌన్సిలర్లు సంగ మాలతి, పోగుల ఉమారాణి, గుండోజి శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు గజానంద్, ప్రవీణ్‌కుమార్, మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు శుక్రవారం డ్రై డే నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని 6వ వార్డులో చేపట్టారు. మురుగు నీటి గుంటలు, ఖాళీ డ్రమ్ముల్లో దోమలు చేరకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, మేనేజర్ గంగాధర్, సిబ్బంది తదితరులున్నారు.

జగిత్యాల: డ్రెయినేజీ పనులను త్వరితగతిన చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శుక్రవారం 35వ వార్డులో డ్రెయినేజీ పనులను పరిశీలించారు. కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్ జయశ్రీ, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పలుచోట్ల లీకేజీ ప్రాంతాలను పరిశీలించారు.

మల్లాపూర్: సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి, మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో కలిసి ఇళ్లలో నిల్వ నీటిని తొలగింపజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ ఇల్లెందుల శ్రీనివాస్, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలతో స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి అన్నారు.



విద్యార్థులతో ఫ్రై డే–డ్రై డే ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరణ్ తదితరులు

వ్యవసాయ సహకార కార్యాలయం తనిఖీ



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో రఘువరణ్

మేడిపల్లి: శుక్రవారం మేడిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని జెడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరణ్ ఆకస్మిక తనిఖీ చేశారు. సంఘం రికార్డులు, రుణమాఫీకి సంబంధించిన రికార్డులు, ఎరువులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. పీఏసీఎస్ ద్వారానే రైతులకు ఎరువులందించాలన్నారు. అడాప్షన్ అధికారి వేణుమాధవ్, పాక్స్ సీఈవో బొందయ్య పాల్గొన్నారు.

సదర్‌మాట్ ప్రాజెక్టును పరిశీలించిన తహసీల్దార్



ప్రాజెక్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

ఇబ్రహీంపట్నం: మూలరాంపూర్ శివారులో గోదావరి నదిపై నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజీ కమ్ బ్రిడ్జిని శుక్రవారం తహసీల్దార్ ప్రసాద్ పరిశీలించారు. బ్యారేజీ వద్ద ఎంతవరకు పనులు పూర్తయ్యాయి.. గేట్లకు బిగించిన తలుపులు, బ్రిడ్జి, వేస్తున్న రోడ్డును పరిశీలించినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న జిల్లా రవాణా శాఖ అధికారి వంశీధర్, ఎంవీఐలు


జగిత్యాలక్రైం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా రవాణా శాఖ అధికారి వంశీధర్ అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామ శివారులోని జిల్లా రవాణా శాఖ ట్రాక్ వద్ద మొక్కలు నాటారు. ఎంవీఐలు రామారావు, ప్రమీల పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా గోపికృష్ణ

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా గోపికృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన రవి వర్మ శనిగరం గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా బదిలీపై వెళ్లగా.. నిజామాబాద్ జిల్లా గుత్ప గ్రామీణ బ్యాంకు బ్రాంచి నుంచి బదిలీపై వచ్చారు.



25వసారి రక్తదానం చేసిన అశోక్



రాయికల్: జగిత్యాల పట్టణంలో గర్భిణికి అత్యవసరంగా ఏ–పాజిటివ్ రక్తం అవసరముండగా.. రాయికల్ పట్టణానికి చెందిన న్యాయవాది అల్లె పురుషోత్తంను సంప్రదించారు. శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్త కుసనపల్లి అశోక్ రక్తదానం చేశారు. అశోక్ రక్తదానం చేయడం ఇది 25వసారి.

పథకాలపై అవగాహన

మల్యాల: రామన్నపేట గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా సాధికారికత చట్టాలు, పథకాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా దుష్ప్రభావం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు.

ముంబయ్ పోలీసుల పేరిట బెదిరింపు

జగిత్యాలక్రైం: ముంబయ్ పోలీసుల పేరిట ఓ యువకుడు బెదిరింపులకు పాల్పడ్డాడు. వివరాలు.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రాంతానికి చెందిన యువకుడు శుక్రవారం ఉదయం ఓ వ్యక్తికి ముంబయ్ కమిషనర్ డీపీ ఫొటోతో ఉన్న వాట్సప్ కాల్ చేశాడు. ఓ యువతిని అత్యాచారం చేశాడని కేసు నుంచి బయట పడాలంటే డబ్బు చెల్లించాలని ఓ యువకుడి తండ్రికి ఫోన్ చేశాడు. దీంతో యువకుడి తండ్రి అప్రమత్తమై వెంటనే పట్టణ పోలీసులను సంప్రదించగా ఫేక్ కాల్ అని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు.

జిల్లాలో సగటున 53.8 మి.మీ వర్షం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు సగటున 53.8 మి.మీ వర్షం కురిసింది. ఇబ్రహీంపట్నం మండలంలో 30.9 మి.మీ, మల్లాపూర్ 53.1, రాయికల్ 97.1, బీర్పూర్ 43.4, సారంగాపూర్ 85.1, ధర్మపురి 67.9, బుగ్గారం 59.9, జగిత్యాలరూరల్ 58.1, జగిత్యాల అర్బన్ 63.5, మేడిపల్లి 41.4 మి.మీ వర్షం కురిసింది. అలాగే కోరుట్లలో 39.5, మెట్‌పల్లి 33.2, కథలాపూర్ 40.7, కొడిమ్యాల 49.2, మల్యాల 53.1, పెగడపల్లి 59.1, గొల్లపల్లి 51.1, వెల్గటూర్ 67.7, ఎండపల్లి 47.2, బీమారంలో 41.9 మి.మీ వర్షం కురిసింది.

యాదగిరి శేఖర్‌రావుకే మద్దతు

మల్యాల: కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల శాసన మండలి సభ్యుడిగా బరిలో నిలిచిన యాదగిరి శేఖర్‌రావుకే తమ మద్దతని మల్యాల మండల ట్రస్మా సభ్యులు తీర్మానం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సమావేశానికి విచ్చేసిన యాదగిరి శేఖర్‌రావుకు ట్రస్మా సభ్యులు మద్దతు పలికారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాప్ కిషన్‌రావు, మండల అధ్యక్షుడు పోకల నరేశ్, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెట్లు పాల్గొన్నారు.



మల్యాలలో సమావేశమైన ట్రస్మా సభ్యులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మెట్‌పల్లిరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్ అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి మండలం వేంపేటలో వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి మాట్లాడారు. భావితరాల మనుగడకు మొక్కలను నాటి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సై చిరంజీవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు రాజారెడ్డి, ప్రవీణ్, కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువ గండి పరిశీలన



ఇబ్రహీంపట్నం: మండల కేంద్రం పరిధిలో కాకతీయ కాలువకు పడిన గండిని శుక్రవారం ఎస్సారెస్పీ ఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈనెల 16న 'సాక్షి'లో 'కాకతీయ కాలువకు గండి' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.

సాక్షి స్పందన